క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా చేరిఖండం, రెడ్డిపల్లి, పాట్నూరు, తునివలస, నర్సాపురం, చిన్నాపురం, విజయానందపురం, నేరెళ్లవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సీపీఐ నాయకుడు తోటయ్య మృతి



తోటయ్య (ఫైల్)

తగరపువలస: సీపీఐ చిట్టివలస ప్రాంత శాఖ సభ్యుడు పిట్ట తోటయ్య(70) వృద్ధాప్య సమస్యలతో గురువారం కార్మికవాడలో తన ఇంటి వద్ద మృతి చెందారు. 1979 నుంచి చిట్టివలస లేబర్ యూనియన్‌లో కొనసాగుతూ చివరి వరకు సీపీఐలో కొనసాగాడు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన భౌతిక కాయాన్ని సీపీఐ నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల నరసింహులు, దామోదర బాబాజీ, సింగిడి అప్పారావు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. ఎర్రజెండాలతో అంతిమయాత్రలో పాల్గొన్నారు.

లోకేష్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

మధురవాడ: విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇతర నాయకులు గురువారం ఏర్పాట్లు పరిశీలించారు. మంత్రి ప్రారంభించనున్న ఏఐ ల్యాబ్‌లో ఏర్పాట్లు, ఇతర అంశాలు అడిగి తెలుసుకున్నారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట నాయకులు, అధికారులు ఉన్నారు.

అమరావతి హ్యాక్‌థాన్ పోటీలు ప్రారంభం

మధురవాడ: మధురవాడ గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాక్‌థాన్-2025 పోటీలు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంటర్నల్ పోటీలు నిర్వహించారు. ఇక్కడ విద్యార్థులకు ఏఐ, ఇతర అంశాలలో నూతన ఆవిష్కరణలు తదితర అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విశాఖతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

'మహిళలకు అండగా ప్రభుత్వం'

పీఎం పాలెం: భీమిలి నియోజకవర్గంలో మహిళల కోసం స్పెషల్ ఎకనామిక్ జోన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. పీఎం పాలెం వీ కన్వెన్షన్ హాల్లో గురువారం నిర్వహించిన స్త్రీ శక్తి పథకం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయం గురించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన అంగీకారం తెలిపారన్నారు. 2026 నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు అందుబాటులోకి వస్తుందని, ఆ సమయానికి 15 కనెక్టింగ్ రోడ్లు, 10 ఫ్లై ఓవర్లు పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో జోన్-2 జెడ్సీ కనకమహాలక్ష్మి, స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ఆందోళన




వేములవలస కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

తగరపువలస: కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం వల్ల తమకు ఉపాధి పోయిందని ఆనందపురం మండలం ఆటో కార్మికులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీపైడితల్లమ్మ ఆటో యూనియన్ అధ్యక్షుడు పతివాడ నరసింగరావు ఆధ్వర్యంలో వేములవలస కూడలిలో ర్యాలీ నిర్వహించి, అనంతరం రాస్తారోకో ద్వారా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. యూనియన్ అధ్యక్షుడు నరసింగరావు మాట్లాడుతూ తమ ఉపాధికి ఉసురు తీసిన కూటమివ ప్రభుత్వమే వాహన మిత్ర ద్వారా ఏటా రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక నాయకులు కె.గోపి, రామారావు, శ్రీను, అప్పలరాజు, వెంకటరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గణనాయకాయ.. గణదైవతాయ



తాటితూరులో దొర యూత్ నెలకొల్పిన పార్వతీ తనయుడు



చిట్టివలస జెడ్పీ హైస్కూల్ వెనుక మండపంలో శివసుతుడు



వేములవలస కూడలిలో మహా గణపతిగా..



ఆనందపురం జెడ్పీహైస్కూల్ వద్ద హనుమతో మహా బలునిగా..



బంటుపల్లి కళ్లాల రోడ్డులో సింహరూఢుడై..



వేములవలస కళ్లాల్లో హంస వాహనంపై..



బ్యాంక్ కాలనీ కుంచమాంచ యూత్ ఆధ్వర్యంలో రూపొందించిన కైలాసగిరిపై శివపరివారం



ఎల్లమ్మపేట వద్ద వైవై యూత్ ఆధ్వర్యంలో



గొల్లలపాలెం వద్ద స్థానిక యువత ఆధ్వర్యంలో ..

పార్వతీ తనయుడు మండపాల్లో కొలువుదీరాడు. వరసిద్ధి వినాయకుడిని వాడవాడలా భక్తి శ్రద్ధలతో అర్చించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు భీమిలి నియోజకవర్గంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భీమిలి అర్బన్, రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాలతో పాటు మధురవాడ, కొమ్మాది, పీఎం పాలెం తదితర ప్రాంతాల్లోనూ కనులపండువగా వేడుకలు జరుగుతున్నాయి. ఉత్సవ కమిటీలు తమ శక్తి మేరకు మండపాలను అలంకరించి బాణసంచా, మేళతాళాలతో గజాననుడిని ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. ఈ ఏడాది ప్రజలలో పర్యావరణంపై అవగాహన కారణంగా ఎక్కువగా మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించారు. గతంతో పోలిస్తే చాలా చోట్ల మండపాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. విద్యా సంస్థలు, కార్యాలయాలు, మార్కెట్లు, కార్మిక సంఘాలు విఘ్నాధిపతిని ప్రతిష్ఠించారు. తొలిరోజే గోస్తని నదిలోని టి.నగరపాలెం, తాటితూరు, మజ్జివలస, మూలకుద్దు, చిట్టివలసతో పాటు భీమిలి గోస్తని సాగర సంగమ తీరంలో నిమజ్జనోత్సవం నిర్వహించారు. మండపాల వద్ద భైరో భజన కార్యక్రమాలు, హరేనామ సంకీర్తనలు, గణపతి హోమాలు నిర్వహించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు.

-తగరపువలస/భీమునిపట్నం/పద్మనాభం/కొమ్మాది/మధురవాడ/పీఎం పాలెం



పరదేశిపాలెంలో పరమశివునిగా..



తిమ్మాపురంలో నృత్యగణపతిగా



నర్సింహనగర్‌లో.. ప్రకృతి ఒడిలో గణేశుడు



మారికవలసలో ఆరున్నర అడుగుల బాలాజీ గణపతి



విలాస్కాన్‌పాలెంలో 8 అడుగుల గణనాయకుడు



చంద్రంపాలెంలో 41 అడుగుల శివపూజా గణపతి



ఆకట్టుకుంటున్న శివలింగాకృతి మండపం



శిల్పారామం వద్ద మండపంలో గణనాథుడు

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



భీమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తగరపువలస: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి అన్నారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బాడ్మింటన్ ఆటల పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు గురువారం బహుమతులు అందించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమిలి డిగ్రీ కళాశాలలో..

భీమునిపట్నం: విద్యార్థులందరూ క్రీడల్లో పాల్గొనాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. శుక్రవారం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాన్ని టీడీపీ కార్యాలయంగా మార్చేశారు

- ప్రజా ప్రతినిధులు లేకుండానే ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ
- సర్పంచ్, వైస్ ఎంపీపీ ఆవేదన



వీఆర్వోకు ప్రొటోకాల్ వివాదంపై ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి, వైస్ ఎంపీపీ బంగారునాయుడు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పంచాయతీలో జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి తమకు సమాచారం ఇవ్వడం లేదని సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు ఇదే విషయమై మజ్జివలస వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సర్పంచ్ ఆదిలక్ష్మితో పాటు ఇదే సెగ్మెంట్ నుంచి ఎంపీటీసీగా ఎన్నికై వైస్ ఎంపీపీ అయిన తనను సచివాలయ సిబ్బంది అవమానిస్తూనే ఉన్నారన్నారు. ప్రస్తుతం పంపిణీ అవుతున్న స్మార్ట్ కార్డుల పంపిణీ గురించి తమకు సమాచారం లేదన్నారు. గ్రామ సచివాలయ కార్యాలయాన్ని టీడీపీ కార్యాలయంగా మార్చేశారన్నారు. ప్రజలచేత ఎన్నుకోబడిన తమను కాదని కేవలం కూటమి నాయకులతోనే కార్యక్రమాలు జరిపిస్తున్నారన్నారు. దీనిపై ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయిందని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నామని చెప్పారు. గోప్యత పాటించవలసిన తమ విషయాలను రికార్డు చేసి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయానికి చేరుస్తున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకుల సిఫారసు లేఖలతో వచ్చిన సచివాలయ ఉద్యోగులకు పార్టీపై అభిమానం ఉంటే ఉద్యోగాలకు రాజీనామా చేసి ఆ పార్టీలో చేరాలన్నారు. నిష్పక్షపాతంగా ఉద్యోగం చేయకుండా సిబ్బంది తరచూ తమను అవమానాలకు గురి చేస్తున్నారన్నారు.

ఉత్సాహంగా స్టార్ చెఫ్ చాలెంజ్



వంటకాలను పరిశీలిస్తున్న డీటీవో మాధవి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్‌లోని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో 'ఫ్లేవర్స్ ఆఫ్ ఆంధ్ర - స్టార్ చెఫ్ చాలెంజ్-2025' వంటల పోటీలు గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ, హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్‌తో కలిసి నిర్వహించిన ఈ పోటీలను డీటీవో జె.మాధవి ప్రారంభించారు. 12 రకాల స్టార్ కేటగిరి హోటల్స్ నుంచి చెఫ్‌లు హాజరై, ఆంధ్ర వంటకాలను తయారు చేశారు. సెప్టెంబరు 5న ఎంజీఎం పార్క్‌లో జరిగే వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా ఈ ఫలితాలు ప్రకటిస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఏఏపీ అధ్యక్షుడు ఎం.వి. పవన్ కార్తీక్, ఏపీ టూరిజం ఫోరం అధ్యక్షుడు విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు నెలలుగా జీతాల్లేవు సారూ..

- చంద్రంపాలెం హైస్కూల్లో ఆయాల ఆవేదన
- ఎమ్మెల్యేకు విన్నవించాలన్నా అనుమతించని వైనం

మధురవాడ: ఏడు నెలలుగా జీతాల్లేక ఇబ్బంది పడుతున్నామని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయాలుగా పని చేస్తున్న ఏడుగురు మహిళలు వాపోయారు. మంత్రి లోకేష్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇతర నాయకులను కలిసి సమస్య వివరించాలని ఆయాలు ప్రయత్నించినా సిబ్బంది, నాయకులు అనుమతించలేదు. అనంతరం వారు ఇతర నాయకులు, మీడియాతో మాట్లాడారు. తమకు 7నెలల నుంచి జీతాలు ఇవ్వలేదన్నారు. తమకు ఇస్తున్న రూ.6వేలలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రూ.3వేలు మాత్రమే ఇస్తామన్నారని, అదీ ఇవ్వలేదని వాపోయారు.

ఆర్‌ఎంపీ వైద్యులకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పద్మనాభం మండల పరిధిలో పని చేస్తున్న ఆర్‌ఎంపీ వైద్యులందరికీ ఆరునెలలకు ఒకసారి రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు వైద్యంపై అవగాహన కల్పించాలని ఎంపీపీ కె.రాంబాబు తెలిపారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ఆర్‌ఎంపీ వైద్యుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీల వైద్యసేవలు ఎంతో కీలకమైనవన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరి వద్దకు వస్తారని, దానికి తగిన విధంగా వారు కూడా సేవలను అందించాలన్నారు. ఆర్‌ఎంపీలకు వైద్యం గురించి మరిన్ని మెలకువలు నేర్పిస్తే బాగా సేవలు అందించగలరని, వారికి సహకరించాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యాధికారి లీలాప్రసాద్ మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు వైద్యం చేయడంతో పాటు ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని సూచించారు.

అమాత్యా.. మోడల్ స్కూల్ ఇదేనా?

- చంద్రంపాలెం హైస్కూల్లో ఎక్కడి సమస్యలు అక్కడే..
- గతేడాది పాఠశాలను సందర్శించి, హామీలు గుప్పించిన లోకేష్
- నేటికీ పరిష్కారం కాని సమస్యలు
- క్రీడా మైదానం అభివృద్ధి గాలికి..
- వర్చువల్ క్లాస్‌రూం ప్రారంభించకుండానే మూలకు..
- నేడు పాఠశాలను సందర్శించనున్న మంత్రి



చంద్రంపాలెం హైస్కూల్లో బురదమయమైన గ్రౌండ్‌ని పరిశీలిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ (ఫైల్)



ప్రస్తుతం చంద్రంపాలెం హైస్కూల్ ఆట మైదానం ఇలా..

మధురవాడ: రాష్ట్రంలోనే పెద్దదైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమస్యల పరిష్కారం రెండడుగులు ముందుకు-నాలుగడుగులు వెనక్కి.. అన్న చందంగా ఉంది. గతేడాది ఆగస్టు 30న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ పాఠశాలను సందర్శించి, పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేస్తామని, వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వచ్చి వెళ్లి ఏడాదవుతోంది. తర్వాత కొందరు అధికారులు, నాయకులు వచ్చి హడావుడి చేసి వెళ్లారు. కానీ సమస్య పరిష్కారం కాలేదు. మళ్లీ మంత్రి పాఠశాలను సందర్శించనున్నారు. నాయకులైతే వచ్చి వెళుతున్నారు. కానీ సమస్యల పరిష్కారం మాత్రం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.

తగ్గిన విద్యార్థుల సంఖ్య: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు, అమ్మ ఒడి తదితర పథకాల ద్వారా విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది. కరోనా సమయంలోనూ విద్యార్థుల అడ్మిషన్లు ఏమాత్రం తగ్గలేదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. తల్లికి వందనం దోబూచులాట, అంతంత మాత్రంగా ఇవ్వడం.. కూర్చునేందుకు బెంచీలు కూడా లేకపోవడం.. ఇతర సమస్యల కారణంగా విద్యార్థుల సంఖ్య 3360 నుంచి 3052కి పడిపోయింది.

బాగుపడని క్రీడామైదానం

మంత్రి వచ్చి వెళ్లిన తర్వాత వారం రోజులు పాటు అధికార యంత్రాంగం హడావుడి చేశారు. తర్వాత మరిచిపోయారు. సాక్షిలో విద్యాశాఖ మంత్రి చెప్పినా సమస్య పరిష్కారం కాలేదని కథనం ప్రచురితమైన తర్వాత కొన్ని లారీల లోడుల మట్టి తెచ్చి, ఇక్కడ ఉన్న మట్టితో కలిపి లెవెల్ చేసి మమ అనిపించేశారు. నీరు బయటకు వెళ్లడానికి మార్గం మాత్రం చూపించలేదు. దీంతో వర్షం వస్తే చెరువులా మారడం, తగ్గిన తర్వాత చిత్తడిగా తయారవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

గదుల కొరత

ఇక్కడ 6నుంచి 10 తరగతుల వరకు 68 సెక్షన్లలో 3052 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం గదులు 77 ఉన్నా, ఉపయోగంలో ఉన్నవి 62 మాత్రమే. స్టాఫ్ రూమ్, డైనింగ్, ఒకేషనల్, కంప్యూటర్, ఏఐ, ల్యాబ్స్, లైబ్రరీ, స్టోర్ రూమ్, సమావేశ మందిరం వంటివి ఇంత పెద్ద స్కూల్‌కు తప్పనిసరి. అన్నీ కలిపితే 120 గదులు అవసరమనేది పాఠశాల యాజమాన్యం లెక్క. కానీ ఇక్కడ ఉన్నవి 62 మాత్రమే. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభించిన అదనపు భవనాన్ని పూర్తి చేస్తే కనీసం 8 గదులు అందుబాటులోకి వచ్చేవి. అదీ లేకపోవడంతో విద్యార్థులు అసంపూర్తి భవనంలో నేలపైనే కూర్చుని చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక మరుగుదొడ్లు, యూరినల్ యూనిట్స్ ఎస్ఎస్ఏ నిబంధనల ప్రకారం 1:40 ఉండాలి. ఆ విధంగా లేవు.

వర్చువల్ క్లాస్ రూం:

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 2018లో రాష్ట్రంలో, ఇతర ప్రాంతాలతో పాటు ఇక్కడ 3 గదులు కలిపి సుమారు.35లక్షలతో వర్చువల్ క్లాస్ రూం, స్టూడియో, రికార్డింగ్ రూం వంటివి ఏర్పాటు చేశారు. కనీసం ప్రారంభానికి కూడా నోచుకోకుండానే అది మూలకు చేరింది. ఇప్పటికీ గదులు తాళం వేసే ఉన్నాయి. దీంతో ప్రజాధనం వృథా అయింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో వర్చువల్ క్లాస్ రూమ్‌ల పరిస్థితీ ఇదే. విద్యాశాఖ మంత్రి వీటి మీద దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి


గదులు	ఉండాల్సినవి	ప్రస్తుతం ఉన్నవి
మొత్తం గదులు	120	62
స్టాఫ్ రూమ్‌లు	6	3
మరుగు దొడ్లు	57	23
యూరినల్స్	80	23
ఎన్‌సీసీ గదులు	3	0
స్కౌట్స్ అండ్ గ్రీన్ క్రాప్స్	3	1
స్పోర్ట్స్	2	0
ఒకేషనల్	3	0
స్టోర్ అండ్ గొడౌన్	2	0
ఇతర అవసరాలకు..	20	0



అసంపూర్తి భవనంలో నేలపై కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

ఇతర సమస్యలివీ..

- పాఠశాలలో నీటి కొరత తీవ్రంగా ఉంది. అంతంతమాత్రంగా వస్తున్న నీరు అయిపోతే, బాలికలు మరుగుదొడ్లకు వెళ్లలేక చాలా ఇబ్బంది పడుతున్నారు. కొందరు ఈ సమస్య వల్ల పాఠశాల మానివేస్తుండగా.. మరికొందరు మధ్యలోనే ఇంటికి వెళ్లిపోవాల్సి వస్తోంది.
- ప్రైవేటు వ్యక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మూలకు చేరింది. కొత్త ప్లాంట్ ఏర్పాటు గురించి ఎవరూ పట్టించుకోలేదు.
- సోలార్, విండ్ ఎనర్జీ పరికరాలు ఉన్నా నిర్వహణ లేక అలంకార ప్రాయంగా మారాయి.
- ఇంత పెద్ద స్కూల్‌కి నైట్ వాచ్‌మన్ పోస్టు లేదు. కనీసం సెక్యూరిటీ గార్డ్ లేరంటే పరిస్థితి ఏం చెప్పాలి?



నిరుపయోగంగా ఉండిపోయిన వర్చువల్ స్టూడియో

డీజేలకు అనుమతివ్వాలని వినతి



నార్త్ ఏసీపీ అప్పలరాజుకు వినతిపత్రం అందిస్తున్న డీజే ఓనర్లు

మధురవాడ: వినాయక చవితి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టంను ఉపయోగించడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో డీజే ఓనర్లు విశాఖ నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజుకు గురువారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పక్కనే ఉన్న జిల్లాల్లో 4 బిన్స్, 4 టాప్స్‌తో ఉత్సవాల్లో, అనుపు కార్యక్రమాల్లో డీజే సౌండ్ సిస్టం ఉపయోగించడానికి అక్కడ పోలీసులు అనుమతి ఇస్తున్నారని, కనీసం అలాగైనా సిటీ పరిధిలో తమకు అనుమతివ్వాలని కోరారు. తమ కుటుంబాలతో పాటు, వీటిపై ఆధారపడిన వందలాది కుటుంబాలకు వినాయక చవితి ఉత్సవాలే ప్రధాన ఆధారమని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రాజ్‌కుమార్, డీజే ఓనర్లు చిల్ల శ్రీను, ఎం. సంతోష్, గోవిందరావు, సీహెచ్‌వీ రమణ, ఈశ్వరరావు, వీరుబాబు తదితరులు పాల్గొన్నారు.